సాక్షి
అనంతపురం
గురువారం । 17 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 555 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



నవజాత శిశువుకు రక్ష

అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 20 పడకల సామర్థ్యంతో మరొక నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 8లో



జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

భూసేకరణ త్వరగా చేపట్టండి




అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ త్వరగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులు, ఏపీఐఐసీ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ తదితర ప్రాజెక్టులకు భూసేకరణ అంశంపై జాయింట్ కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ అత్యంత కీలకమైన అంశమన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి 544–డీ (అనంతపురం–బుగ్గ, అమరావతి హైవే), ఎన్‌హెచ్67, జీడిపల్లి, ఉల్లికల్లు, లక్ష్మంపల్లి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, ఏపీఐఐసీ పరిధిలోని పలు ప్రాజెక్టులకు భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర, నిషాంత్‌రెడ్డి, ఏపీఐఐసీ జెడ్‌ఎం వరప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, అహుడా కార్యదర్శి చిన్నయ్య, ఎన్‌హెచ్ అధికారి రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరుగున కృష్ణమ్మ

- హంద్రీ–నీవాకు నీటి విడుదల
- రెండు పంపులతో 675 క్యూసెక్కుల ఎత్తిపోత



మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ–నీవాకు వస్తున్న కృష్ణా జలాలు

అనంతపురం సెంట్రల్: జిల్లాకు కృష్ణమ్మ పరుగుపరుగున వస్తోంది. శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకానికి నీటిని విడుదల చేశారు. బుధవారం మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ మోటార్లను ఆన్ చేసి ప్రారంభించారు. తొలుత రెండు పంపుల ద్వారా 675 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. క్రమంగా నీటిని పెంచుకుంటూ పోవాలని నిర్ణయించినట్లు హంద్రీ–నీవా ఎస్‌ఈ దేశానాయక్ తెలిపారు. ఇదిలా ఉంటే హంద్రీ–నీవాకు ఎన్ని రోజులు నీళ్లు వస్తాయో చెప్పలేమని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 112.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలోకి ఇన్‌ఫ్లో రాలేదు. మొత్తం 5,254 క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నీటి మట్టం 862 అడుగులు కాగా 834 అడుగుల వరకు హంద్రీ–నీవాకు ఇబ్బంది ఉండదని వివరించారు. ఆలోగా వర్షాలు పడి ఇన్‌ఫ్లో పెరిగితే హంద్రీ–నీవాకు నిరంతరాయంగా కృష్ణా జలాలు వస్తాయని పేర్కొన్నారు. నీటిమట్టం పడిపోతే మల్యాల ఎత్తిపోతల పథకానికి నీళ్లు తీసుకోవడానికి కుదరదని వివరిస్తున్నారు. రైతులు హంద్రీ–నీవాపై ఆధారపడి ఇప్పుడే పంటలు సాగుచేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఐలుగా పదోన్నతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 12 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్ల (ఎస్‌ఐ)కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు (సీఐ)లుగా పదోన్నతి లభించింది. అనంతపురం జిల్లాకు సంబంధించి పీటీసీలో పనిచేస్తున్న బి.మహానంది, వి.రమేష్, అనంతపురంలో పనిచేస్తున్న టి.నాగమణి, ఎస్.జాకీర్, ఎస్కే చాంద్‌బాషా, బి.రాఘవరెడ్డి, యు.వలిబాషా, బి.రామకృష్ణారెడ్డి, యం.శ్రీకాంత్, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి 'కియా' పోలీసు స్టేషన్ ఎస్‌ఐ కె.వెంకటరమణ, ముదిగుబ్బ ఎస్‌ఐ హేమంత్ కుమార్, బత్తలపల్లి ఎస్‌ఐ వెంకట శ్రీహర్ష పదోన్నతి పొందారు. వీరు ఆయా స్టేషన్ల విధుల నుంచి రిలీవ్ అయ్యి కర్నూలులోని ఐజీ కార్యాలయంలో గురువారం రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మార్కెట్‌కు భారీగా టమాట

- కిలో గరిష్ట ధర రూ.45



అనంతపురం అగ్రికల్చర్: టమాట అమ్మకాలు అమాంతం పెరిగాయి. మార్కెట్‌కు పెద్ద ఎత్తున సరుకు వస్తోంది. రికార్డుస్థాయిలో పలికిన ధరలు ప్రస్తుతం గణనీయంగా తగ్గాయి. బుధవారం 4,500 టన్నుల టమాటాలు కక్కలపల్లి మండీకి వచ్చాయి. కిలో టమాట ధర గరిష్టంగా రూ.45 పలికిందని రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. కనిష్టంగా రూ.20, సరాసరిన రూ.30 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయని పేర్కొన్నారు.

ఫల రాజసం



ఉద్యాన పంటల ఖిల్లా 'అనంత'

- 32 లక్షల మెట్రిక్ టన్నుల పండ్ల దిగుబడి
- ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలోనే టాప్
- స్వీట్ ఆరెంజ్ మొదలు బొప్పాయి వరకు నాణ్యమైన ఫలాలు
- నరసమైన ధరకే పండ్లు, కూరగాయలు లభ్యం.. విదేశాలకూ ఎగుమతి



ఖర్జూర ఫలాలను తెంపుతున్న మహిళా రైతు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతంగా పేరుగాంచిన అనంతపురంలో 'ఫల రాజసం' అబ్బురపరుస్తోంది. అరుదైన పండ్లు, రుచికరమైన కూరగాయల ఉత్పత్తులకు కేరాఫ్‌గా నిలిచి రికార్డు సృష్టిస్తోంది. ఇక్కడ పండే బత్తాయి పండ్లు నిగనిగలాడుతాయి. ఎర్రగా మెరిసే డ్రాగన్ పండ్లు ఆకర్షిస్తాయి. అంజూర్ పండ్ల రాశులు మురిపిస్తాయి. ఎరుపు – పసుపు వర్ణం కలగలసిన దానిమ్మ పండ్లు నోరూరిస్తాయి. అన్నిటికీ మించి అరబ్ షేక్‌లను సైతం ఆకట్టుకున్న గ్రాండ్ 9 అరటి గెలలు మైమరిపిస్తాయి.

32 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి..

రాష్ట్రంలో హార్టికల్చర్ హబ్ (ఉద్యాన పంటలకు కేంద్రం)గా అనంతపురం జిల్లా పేరుగాంచింది. చీనీ, అరటి తోటలు భూమికి ఆకుపచ్చటి రంగేసినట్టు కనిపిస్తుంటాయి. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే ఈ తరహా పంటలు ఇప్పుడు రైతుకు మంచి ఆదాయ వనరుగా మారాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 32 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు, కూరగాయలు ఈ జిల్లా నుంచే ఉత్పత్తి అయ్యాయి. అందులో సింహభాగం ఒక్క కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచే 10.85 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తవుతున్నాయి.

ఉద్యాన పంటల దిగుబడి వివరాలు..

నియోజకవర్గం	ఉత్పత్తి (మెట్రిక్ టన్నుల్లో)
తాడిపత్రి	2,61,480
అనంతపురం	46,117
ఉరవకొండ	52,626
శింగనమల	10,20,423
రాయదుర్గం	5,64,291
కళ్యాణదుర్గం	10,85,208
గుంతకల్లు	2,56,187

మన కూరగాయలు భలే రుచి గురూ..

జిల్లాలో పండించే కూరగాయలు రుచికి, నాణ్యతకు పేరెన్నికగన్నవి. టమాట, పచ్చిమిరప, బెండకాయలు, ఎండు మిర్చి, గోరు చిక్కుడు, అనప, వంకాయలు అద్భుతమైన రుచికి ఆలవాలం. పైగా స్థానికంగా పండించే ఈ కూరగాయలు ధరలోనూ అసాధారణమేమీ కాదు. సరసమైన ధరలకు లభిస్తుండటంతో కొనుగోలుదారులకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఉన్నాయి. ఇక్కడ ఉద్యాన పంటలన్నీ బోర్లకిందే ఉన్నాయి. గడిచిన నాలుగేళ్లుగా కరెంటు కోతలు లేకపోవడం, వర్షాలు సమృద్ధిగా పడటంతో మంచి ఫలసాయం రావడానికి కారణమైంది.

విదేశాలకు ఎగుమతి..

జిల్లాలో 1,27,599 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇక్కడ పండిన అరటి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, మామిడి, సపోట, రేగు, జామ, నేరేడు, ద్రాక్ష, పుచ్చకాయ, మస్క్‌మెలన్ (ఢిల్లీ దోస), బొప్పాయి, టమాట, పచ్చిమిర్చి, బెండ, ఉల్లి పంట ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

ఎకరాకు రూ.20 లక్షలు



మూడు ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ పంట పెట్టాను. తొలి ఏడాది ఎకరాకు రూ.3 లక్షల దాకా పెట్టుబడి వస్తుంది. ఆ తర్వాత తగ్గుతుంది. కాపుకొచ్చాక ఎకరాకు 20 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను ప్రస్తుతం రూ.లక్ష పలుకుతోంది. మరో ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఖర్జూర పెట్టాను. ఆ పంట ఇంకా కాపునకు రాలేదు. మన నేలలు ఏ ఫలాలకైనా అనుకూలంగానే ఉంటాయి. – కె.వి.రమణారెడ్డి, రైతు, మర్తాడు, గార్లదిన్నె మండలం

అనుకూలమైన వాతావరణమే



అనంతపురం జిల్లాలో పండ్ల తోటలకు అనుకూలమైన వాతావరణం ఉంది. ఇక్కడ రైతులు కష్టపడే తత్వం ఎక్కువ. రాష్ట్రంలో అన్ని రకాల పండ్లను పండించే జిల్లాల్లో మొదటి స్థానం అనంతపురానిదే. ఈ తరహా పంటలు రైతులకు లాభదాయకంగా కూడా ఉంటాయి. – రఘునాథరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్, హార్టికల్చర్

కొత్త బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు



కణేకల్లు చెరువులో నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్

- ప్రభుత్వ విప్ కాపు, ఎంపీ రంగయ్య

కణేకల్లు/బొమ్మనహాళ్: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ (హెచ్చెల్సీ) పరిధిలో 165/028 కిలోమీటర్ (మీన్లహళ్లి) వద్ద కూలిన బ్రిడ్జి పక్కన కొత్త బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య స్పష్టం చేశారు. హెచ్చెల్సీ ఎస్ఈ ఎస్.రాజశేఖర్, కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ డీఈఈ మద్దిలేటితో కలిసి విప్, ఎంపీ బుధవారం తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువను పరిశీలించారు. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద 113/600 కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీకి పైపింగ్ పడిన చోట ఇసుక బస్తాలతో వేసిన రింగ్‌బండ్‌ను, కణేకల్లు చెరువు అవుట్‌ఫ్లో రెగ్యులేటర్‌ను పరిశీలించారు. చెరువులో నీటిమట్టం వివరాలతోపాటు పీఏబీఆర్, జీబీసీ, ఎంపీఆర్‌లకు ఏ మేరకు నీటిని విడుదల చేస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అక్కడి నుంచి నేరుగా మీన్లహళ్లి శివారులో హెచ్చెల్సీ పరిధిలో 165/028 కిలోమీటర్ వద్ద కూలిపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. రైతులు పొలాలకు వెళ్లడానికి కీలకమైన ఈ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని హెచ్చెల్సీ ఎస్ఈని ఆదేశించారు. అనంతరం విప్, ఎంపీ మీడియాతో మాట్లాడుతూ హెచ్చెల్సీ ఆధునికీకరణ పనుల్లో భాగంగా పిల్లర్ల స్థాయిలో ఆగిపోయిన కొత్త బ్రిడ్జిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం హెచ్చెల్సీలో నీరు ప్రవహిస్తున్నందున పనుల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించి పనులు చేపడతామన్నారు. బ్రిడ్జి నిర్మాణంపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్నది రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు. ఆయకట్టు రైతులకు మంచి జరుగుతుంటే టీడీపీ నేత కాలవ శ్రీనివాసులు ఓర్వలేకపోతున్నారని కాపు మండిపడ్డారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ ఏఈఈ అల్తాఫ్, గోపాల్‌నాయక్, కణేకల్లు మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పూర్తికి స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎస్ఈ వెంకటరెడ్డి, పీడీ కేశవనాయుడు

అనంతపురం అర్బన్: సామూహిక గృహప్రవేశాల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను వందశాతం పూర్తి చేసేందుకు వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ అంశంపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో హౌసింగ్ పీడీ కేశవనాయుడు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎస్ఈ వెంకటరెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామూహిక గృహప్రవేశాల్లో భాగంగా 20,512 ఇళ్ల నిర్మాణం లక్ష్యాన్ని వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ప్రతి ఇంటి వద్ద లబ్ధిదారుతో కలిసి ఫొటో తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. లే అవుట్ల వద్ద ఆర్చ్‌ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అదే విధంగా తాగునీరు, విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో ఆర్డీఓలు, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, హౌసింగ్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు డీఎంఏ రాక


అనంతపురం క్రైం: డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) కోటేశ్వరరావు గురువారం అనంతపురం రానున్నారు. ఆర్డీటీ స్టేడియం సమీపంలోని ఎస్‌జీఆర్ ఫంక్షన్ హాలులో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై వర్క్‌షాపునకు ఆయన హాజరు కానున్నారు. జిల్లాలోని నగరపాలక సంస్థ, వివిధ మునిసిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న అడ్మిన్, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం సిబ్బంది దాదాపు వెయ్యి మంది పాల్గొననున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి పూర్తి చేశారు. డీఎంఏతో పాటు పథకం స్పెషలాఫీసర్ సుబ్బారావు వర్క్‌షాప్‌కు విచ్చేస్తున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడురూరల్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు 8వ తరగతి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎం.సాయిరామ్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ సూచించారు. ఈ మేరకు వారు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 3న రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో ఈ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూళ్లలో ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. సెప్టెంబరు 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టీచర్ల సర్దుబాటు షురూ

- టీచర్ల కొరత ఉన్న స్కూళ్లకు 'మిగులు' సర్దుబాటు
- స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో తొలి ప్రాధాన్యత
- రేపటిలోగా ప్రక్రియ పూర్తికి విద్యాశాఖ ఉత్తర్వులు



రాప్తాడు రూరల్: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు అవసరమైన స్కూళ్లను మిగులు (సర్‌ప్లస్) టీచర్లతో సర్దుబాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 18 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూలై 31 నాటికి ఉండే విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. ఇందుకోసం జిల్లాస్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆమోదంతో అవసరమైన స్కూళ్లకు టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. ఈ కమిటీకి అనంతపురం కలెక్టర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కో చైర్మన్‌గా, అనంతపురం డీఈఓ కన్వీనర్‌గా, శ్రీసత్యసాయి డీఈఓ మెంబరుగా ఉంటారు.

ముందుగా స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల నుంచి..

ముందుగా ఆయా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని స్కూళ్లలో మిగులుగా ఉన్న టీచర్లను సర్దుబాటు చేస్తారు. అక్కడ లేకపోతే మండల పరిధిలో చేస్తారు. అక్కడ అందుబాటులో లేకపోతే పక్క మండలం నుంచి సర్దుబాటు చేస్తారు. అక్కడా అవకాశం లేకపోతే డివిజన్, ఆ తర్వాత పక్క డివిజన్ నుంచి సర్దుబాటు చేస్తారు. అవసరమైతే ఒక యాజమాన్యం నుంచి మరో యాజమాన్యం పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు. హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు టీచర్లు ఉండేలా సర్దుబాటు చేస్తారు. మునిసిపల్ పాఠశాలలకు మునిసిపల్ పాఠశాలల నుంచే సర్దుబాటు చేయాలి. అక్కడ అందుబాటులో లేకపోతే ఇతర యాజమాన్యాల నుంచి సర్దుబాటు చేసుకోవచ్చు.

కసరత్తు చేస్తున్నాం



విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి టీచర్లు తక్కువగా ఉండే స్కూళ్లలో బోధనకు ఇబ్బందులు లేకుండా మిగులుగా ఉన్న స్కూళ్ల నుంచి సర్దుబాటు చేస్తాం. ఈ ప్రక్రియ ప్రారంభమైంది. కసరత్తు చేస్తున్నారు. రేపటిలోగా పూర్తి చేస్తాం. స్కూళ్ల వారీగా విద్యార్థుల సంఖ్య, టీచర్ల సంఖ్యను పరిశీలిస్తున్నాం. ఏ ఒక్క స్కూల్‌లోనూ బోధనకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.
– ఎం.సాయిరామ్, డీఈఓ, అనంతపురం

నేడు, రేపు జాబ్‌మేళా

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈ నెల 17, 18 తేదీల్లో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ఎ.కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నవభారత్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీ సేల్స్ రెప్రజెంటేటివ్ పోస్టులకు జాబ్ మేళా ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి పాసైన వారు, గ్రాడ్యుయేట్లు 18 నుంచి 35 సంవత్సరాలలో వయసున్న వారు సర్టిఫికెట్లు, బయోడేటాతో హాజరు కావాలని సూచించారు. శుక్రవారం అక్షయ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుకు సంబంధించి ట్యాలీ ఆపరేటర్, సివిల్ డిపార్ట్‌మెంట్, డ్రైవర్స్, సీనియర్ మార్కెటింగ్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు. డ్రైవర్ల పోస్టులకు కనీసం పదవ తరగతి, నాలుగు చక్రాల వాహనం లైసెన్సు కలిగివుండాలని, మిగతా పోస్టులకు గ్రాడ్యుయేషన్ పూర్తయిన యువతీ యువకులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు.

శుభ ముహూర్తాలకు వేళాయె

- శ్రావణంలో నందడే నందడి



అనంతపురం కల్చరల్: శుభకార్యాలను పూర్తిగా దూరం పెట్టిన ఆషాఢం.. ఆపైన వచ్చిన అధిక శ్రావణ మాసం ముగిసి గురువారం నుంచి నిజ శ్రావణం ప్రారంభమైంది. వివాహ శుభ ముహూర్తాలతో పాటు శ్రావణ మాసమంతా పలకరించిపోయే పండుగలు అందరిలోనూ ఆనందోత్సాహాలు నింపుతాయి. ఈ నెల 21న నాగుల చవితి, గరుడ పంచమి రాకతో ప్రధాన పండుగలు ఆరంభం కానున్నాయి. 22న మంగళగౌరీవ్రతాలు, 25న వరలక్ష్మీవ్రతం, 31న రాఖీ పౌర్ణమి, ఈ నెల చివరలో 31 నుండి మూడు రోజుల పాటు రాఘవేంద్రస్వామి ఆరాధనా ఉత్సవాలు, సెప్టెంబర్ 6న శ్రీకృష్ణాష్టమి పర్వదినాలు వరుసగా వస్తాయి. 14నపోలాల అమావాస్యతో నిజ శ్రావణంలో వచ్చే పండుగలు ముగిసి భాద్రపదంలో ప్రవేశిస్తాయి.

శుభముహూర్తాలివే..

ముత్తయిదువులు భక్తిశ్రద్ధలతో ఆచరించే నోముల కోసం, శుభకార్యాల కోసం ఎదురు చూస్తున్న శ్రావణం ఈ నెల 16 నుంచి వచ్చేనెల 14 వరకు వరకు ఉంటుంది. ఈ నెల 19, 20, 22, 24, 26, 29, 30, 31తో పాటు సెప్టెంబర్ 1, 2, 3, 7, 8 తేదీల్లో శుభకార్యాలు చేసుకోవడానికి బాగా వీలైన తిథులని పురోహితులంటున్నారు.

క్లుప్తంగా

దుకాణం దగ్ధం



మంటల్లో కాలిపోయిన దుకాణం

యాడికి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఓ దుకాణం దగ్ధమైంది. వివరాలు... యాడికి గ్రామానికి చెందిన అశోక్ స్థానిక బస్టాండ్ సమీపంలో ఓ కూల్‌డ్రింక్స్ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి లావాదేవీలు ముగించుకుని దుకాణానికి తాళం వేసుకుని ఇంటికి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న యజమాని అక్కడికి చేరుకునే లోపు రూ..5 లక్షల విలువైన పరికరాలు, సామగ్రి, కూల్ డ్రింక్స్ దగ్ధమయ్యాయి.

ఎరువుల సీజ్



సీజ్ చేసిన ఎరువులను చూపుతున్న ఏఓ మహబూబ్‌బాషా

యాడికి: మండలంలోని రాయలచెరువులో ఉన్న సంకల్ప ఎరువుల దుకాణంలో రూ.50 వేలు విలువైన ఎరువులను సీజ్ చేసినట్లు మండల వ్యవసాయాధికారి మహబూబ్ బాషా తెలిపారు. బుధవారం తనిఖీలు చేపట్టిన సమయంలో దుకాణంలో 19-19-19 రకం ఎరువు బస్తాపై ముద్రించిన సమాచారానికి బస్తాలో ఉన్న ఎరువుకు పొంతన లేకపోవడాన్ని గుర్తించారు. రికార్డులు పరిశీలించి ఎరువులను సీజ్ చేశారు.

డీఎడ్ పరీక్షలకు 58 మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న గోవిందనాయక్

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండు కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన డీఎడ్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 58 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 167 మందికి గాను 109 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ పరిశీలించారు.

నవజాత శిశువుకు రక్ష

- సర్వజనాస్పత్రిలో కొత్తగా మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటు
- రూ.35 లక్షలు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



ప్రస్తుతమున్న నవజాత శిశు కేంద్రంలో వార్మర్లపై పసికందులు

అనంతపురం క్రైం: జిల్లా సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటు కానుంది. పసికందుల అడ్మిషన్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అదనంగా 20 పడకల సామర్థ్యంతో ఉన్న మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది.

ఇప్పటికే అందుబాటులో ఓ కేంద్రం..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ వైద్య రంగాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూలంగా ప్రక్షాళన చేశారు. దీంతో నిరుపేద రోగులకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతోంది. శిశు మరణాల నివారణకు ప్రత్యేక చొరవ తీసుకున్న ప్రభుత్వం... రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పసికందుల అడ్మిషన్లు అత్యధికంగా ఉన్న ఆస్పత్రులకు 20 పడకల సామర్థ్యంతో మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు అనుమతులు జారీ చేసింది. ఇందులో భాగంగా అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు రూ.35 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే ఆస్పత్రిలో ఓ కేంద్రం అందుబాటులో ఉండగా, మరో మూడు నెలల్లో కొత్తగా 20 పడకల కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి అనువైన స్థలాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఆదేశాల మేరకు చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, డాక్టర్ సంజీవప్ప, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసశౌరి, ఎస్ఎన్‌సీయూ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్‌నాయక్ ఎంపిక చేశారు. కేంద్రం అందుబాటులోకి రాగానే నలుగురు వైద్యులు, 10 మంది స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బందిని నియమించనున్నారు.

ఖరీదైన వైద్యం ఉచితం..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 2011లో 20 పడకల సామర్థ్యంతో నవజాత శిశు కేంద్రం ఏర్పాటైంది. రోజుల వ్యవధి పసికందులకు ఈ కేంద్రంలో పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యాన్ని అందిస్తున్నారు. ప్రతి నెలా కాన్పుల వార్డులో 700 నుంచి 800 వరకూ ప్రసవాలు జరుగుతాయి. అందులో బరువు తక్కువ, కామెర్లు, జన్యుపరమైన, సెప్సిస్, తదితర ఇన్‌ఫెక్షన్లతో బాధపడే పసికందులను నవజాత శిశు కేంద్రంలో చేర్చి చికిత్స అందజేస్తున్నారు. రోజూ 35 నుంచి 40 మంది పసికందులకు ఫొటోథెరపీ, వార్మర్లు, సీప్యాప్, అవసరమైతే వెంటిలేటర్ ద్వారా చికిత్స చేస్తున్నారు. ఈ కేంద్రంలో ప్రతి నెలా 200 అడ్మిషన్లు ఉంటాయి. చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్‌నాయక్, వైద్యులు డాక్టర్ దినకర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ హరిణి, డాక్టర్ కళావతి, 14 మంది స్టాఫ్‌నర్సులు, 3 ఎఫ్ఎన్‌ఓలు, ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది అందుబాటులో ఉంటారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ తరహా చికిత్స అందించేందుకు రోజుకు రూ.10వేల నుంచి రూ. 30 వేల వరకు వసూలు చేస్తున్నారు.

పసికందులకు నాణ్యమైన వైద్యం



ఉమ్మడి జిల్లాలోని పలు మండలాలతో పాటు పొరుగున ఉన్న జిల్లా నుంచి కష్టతరమైన కాన్పుల కేసులు జీజీహెచ్‌కు ఎక్కువగా వస్తున్నాయి. ఇందులో తక్కువ బరువు, వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న పసికందులను గుర్తించి నవజాత శిశు కేంద్రంలో నాణ్యమైన వైద్యం అందజేస్తున్నాం. అత్యధిక కేసులు నమోదవుతున్న నేపథ్యంలో పసికందులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రభుత్వం మరో కేంద్రం ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

ట్రాక్టర్-లారీ-బస్సు ఢీ

- లారీ డ్రైవర్‌కు గాయాలు
- ప్రయాణికులు సురక్షితం

పామిడి: స్థానిక 44వ జాతీయ రహదారిపై నీలూరు క్రాస్ సమీపంలో బుధవారం వేకువజామున వరుసగా ట్రాక్టర్, లారీ, ఆర్టీసీ బస్సు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీ డ్రైవర్, ఢిల్లీకి చెందిన ప్రజాపతికి రక్తగాయాలయ్యాయి. ఢిల్లీకి టెంకాయల లోడుతో వెళుతున్న లారీకి వెనుకలే అనంతపురం నుంచి ఎమ్మిగనూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఉంది. నీలూరు క్రాస్ వద్దకు చేరుకోగానే అప్పటికే టైర్ పంఛర్ కావడంతో రోడ్డు పక్కన ఆపి ఉంచిన కట్టెల లోడుతు ఉన్న ట్రాక్టర్‌ను గమనించకుండా లారీ డ్రైవర్ ఢీకొన్నాడు. అదే సమయంలో వెనుకనే వస్తున్న బస్సు వేగాన్ని డ్రైవర్ నియంత్రించుకోలేక పోవడంతో లారీ వెనుక భాగాన్ని ఢీకొన్నాడు. లారీలోని టెంకాయలన్నీ రోడ్డుపై చెల్లా చెదరయ్యాయి. బస్సు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మూడు వాహనాలూ దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

బతికుండగానే చనిపోయినట్లు చూపిస్తారా?



రాజకీయ పార్టీ నేతలతో సమావేశమైన ఎన్నికల అధికారులు

ఉరవకొండ: ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని, తమకు వ్యతిరేకులైన వారిని చనిపోయారంటూ కొన్ని రాజకీయ పార్టీల నేతలు ఫిర్యాదు చేస్తున్నారని, బతికుండగానే చనిపోయినట్లు రికార్డులో ఎలా నమోదు చేస్తారంటూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శంకరయ్య దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీ నేతలతో రిటర్నింగ్ అధికారి సమావేశమై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజు, నరసింహులు తీసుకెళ్లారు. మాట్లాడుతూ.. ఒకే బూత్‌లో ఉండాల్సిన కుటుంబ సభ్యులను వేర్వేరు బూత్‌ల్లోకి మార్చడం సబబు కాదన్నారు. పట్టణంలో కొత్త డోర్ నెంబర్లు కేటాయించారని, దీంతో ఓటరు జాబితాలోనూ కొత్త డోర్‌నెంబర్లు మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఈడీటీ మునీంద్ర, వంశీకృష్ణ పాల్గొన్నారు.

సీఎంను కలసిన విశ్వ



సీఎం వైఎస్ జగన్‌కు వివాహ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వీరన్న (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న కలిశారు. ఈ నెల 27న అనంతపురంలో జరిగే తన కుమారుడు విశ్వం వివాహ వేడుకకు హాజరై, వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను సీపీ వీరన్న అందజేశారు.

18న షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

పుట్టపర్తి టౌన్: జిల్లా షూటింగ్ బాల్ సీనియర్ జట్టు ఎంపికకు ఈనెల 18న ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రటరీ పూల ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎంపిక పోటీలుంటాయని, క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు రాష్ట్ర స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. పూర్తి వివరాలకు 95730 65966 నంబర్లో సంప్రదించాలన్నారు.

ఉప ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం అర్బన్: పంచాయతీ ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న పెద్దపప్పూరు మండలం దేవునుప్పలపాడు పంచాయతీ సర్పంచ్, యల్లనూరు మండలం జంగాపల్లి పంచాయతీ సర్పంచ్ స్థానాలకు, 33 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఇందులో దేవునుప్పలపాడు సర్పంచ్ స్థానం, 21 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవం అయ్యాయన్నారు. యాడికి మండలం వెంగన్నపల్లి పంచాయతీ ఐదో వార్డుకు నామినేషన్లు దాఖలు కాలేదన్నారు. దీంతో జంగాపల్లి సర్పంచ్ స్థానానికి, 11 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఆదేశించారు. నిర్వహణలో చిన్నపాటి పొరపాటు కూడా జరగకూడదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు కావాలని ఆదేశించారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు.

పటిష్టంగా నిర్వహించండి

ఎన్నికల నిర్వహణకు 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. 14 మంది ప్రిసైడింగ్ అధికారులు, 29 మంది అదనపు పోలింగ్ అధికారులు నియమించాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వెలుతురు బాగా ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో చిత్రీకరణ కచ్చితంగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ మధుసూదన్, డీపీఓ ప్రభాకర్‌రావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుసేన్, యాడికి తహసీల్దారు అలెగ్జాండర్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణమ్మ, గుత్తి తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ శివాజీరెడ్డి, డివిజన్ పంచాయతీ అధికారి సుమనజయంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు సహకరించాలని కలెక్టర్ గౌతమి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఇంటింటి సర్వే అంశంపై బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రస్తుతం జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఈనెల 21వ తేదీతో ముగుస్తుందన్నారు. ఇప్పటి వరకు 70 శాతం పైగా ఇంటింటి సర్వే జరిగిందన్నారు. గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేలో పార్టీ పోలింగ్ ఏజెంట్లు పాల్గొనాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ గాయత్రీ దేవి, ఎన్నికల డీటీ కనకరాజు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

అనంతపురం అర్బన్: బాల్య వివాహాలను అరికట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. బాల్యవివాహాల నివారణ, కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు అరికట్టేందుకు మహిళా శిశు సంక్షేమ, వైద్యారోగ్య, విద్యాశాఖలు సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి వారి పెద్దలతో మాట్లాడి తిరిగి పాఠశాలకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాలు, బాలికలపై లైంగిక దాడులకు అడ్డుకట్ట వేయాలన్నారు. బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్న కణేకల్లు తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను, దుష్ప్రభావాలపైన అవగాహన కల్పించాలన్నారు. 'పుస్తకాలు మోసే వయసులో పుస్తెల భారం వద్దే వద్దు.. బాల్య వివాహాలు ఆపుదాం... బాల్యాన్ని రక్షిద్దాం' అంటూ ఐసీడీఎస్ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, జెడ్పీ సీఈఓ భాస్కర్ రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డీఈఓ సాయిరాం, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డీఎంహెచ్‌ఓ యుగంధర్, బీసీ సంక్షేమ అధికారి ఖుష్బూ కొఠారి, గిరిజన సంక్షేమాధికారి అన్నాదొర, డీపీఓ ఫరూక్ బాషా, జేజేబీ శ్రీనివాసులు, డీసీపీఓ సుబ్రమణ్యం, 1098 కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్‌పై టీడీపీ నేత దాడి



గాయపడిన వలంటీర్ రాజా

గుత్తి: స్థానిక 22వ వార్డు వలంటీర్ యక్కల రాజాపై టీడీపీ నేత సత్యనారాయణ అలియాస్ సత్య గడారుతో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తిలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో నివాసముంటున్న యక్కల రాజా 22వ వార్డు వలంటీర్‌గా పని చేస్తున్నాడు. వర్షం వచ్చినపుడు నీళ్లు ఇంటిలోకి రాకుండా రెండు రోజుల క్రితం రాజా తన ఇంటి ఎదుట రోడ్డుపై చిన్నపాటి అడ్డుకట్ట వేశాడు. ఈ విషయం గిట్టని ఎదురింటిలో నివాసముంటున్న టీడీపీ నేత సత్య.. తన మనుషులను పిలిపించుకుని సిమెంట్ అడ్డుకట్టను తొలగించాడు. ఆ సమయంలో అడ్డుకోబోయిన రాజాపై గడారుతో సత్య దాడి చేశాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ పక్కనే పడి ఉన్న కర్రతో సత్యపై రాజా దాడి చేశాడు. స్థానికులు అడ్డుకుని రాజాను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితులిద్దరూ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం మానేయమన్నందుకు మనస్తాపంతో ఇద్దరు బలవన్మరణానికి పాల్పడగా.. ఫోన్ సంభాషణ వద్దన్నందుకు ఓ యువతి, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు...



తాడిపత్రి: మృతుడు రామకృష్ణ



యల్లనూరు: మృతురాలు అశ్విని

తాడిపత్రి: వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గుర్రప్ప రామకృష్ణ (25) ఏడాది క్రితం తాడిపత్రికి వలస వచ్చి సంజీవనగర్ రెండో రోడ్డులోని అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. భార్య మాధవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ, ఇతర అవసరాలకు తాడిపత్రికి చెందిన దామోదరరెడ్డి, నరసింహాచారి, కంబాల లక్ష్మీనారాయణ వద్ద అప్పు చేశాడు. సకాలంలో అప్పులు తీర్చకపోవడంతో వడ్డీల భారం పెరిగి రూ.50 లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో డబ్బు చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారులు తరచూ ఇంటి వద్దకెళ్లి గొడవ చేయసాగారు. దీంతో మనస్తాపం చెందిన రామకృష్ణ... మంగళవారం రాత్రి కూల్‌డ్రింక్‌లో విషపూరిత గుళికలు కలుపుకుని తాగాడు. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు తాడిపత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం తాగొద్దన్నందుకు..

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలోని ఓబుళదేవనగర్‌కు చెందిన ప్రైవేట్ ఫొటోగ్రాఫర్ వంశీకృష్ణ (26)కు రెండేళ్ల క్రితం మదనపల్లికి చెందిన సునీతతో వివాహమైంది. సంతానం లేదు. మద్యానికి బానిసైన వంశీకృష్ణ.. భార్య బతిమలాడినా తాగుడు మానుకోలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన భర్త మధ్యాహ్నం పీకల దాకా మద్యం సేవించి వచ్చాడు. దీంతో సునీత మందలించింది. తీరు మార్చుకోకపోతే నవ్వుల పాలవు తామని హితవు పలికింది. దీంతో మనస్తాపం చెందిన వంశీకృష్ణ లోపలి గదిలోకి వెళ్లి గడియపెట్టుకుని, ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఎంత పిలిచినా లోపల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో అనుమానం వచ్చి కిటికీ నుంచి ఉరితాడుకు విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న అనంతపురం రెండో పట్టణ సీఐ శివరాముడు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రెండో రోజుల్లో కుమార్తె వివాహం ఉండగా..

తాడిపత్రి: స్థానిక శ్రీరాముల పేటకు చెందిన మల్లికార్జున (45) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భార్య కుమారి, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్ని నెలలుగా పనికి వెళ్లకుండా అతిగా మద్యం సేవించి ఇంటి పట్టునే ఉంటున్నాడు. దీంతో మరో రెండు రోజుల్లో కుమార్తె వివాహం పెట్టుకుని అతి మద్యం తాగడం మంచిది కాదని, బంధువుల ఎదుట పరువు పోతుందని మంగళవారం రాత్రి కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన మల్లికార్జున రాత్రి అందరూ నిద్రలో ఉండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అబ్బాయితో మాట్లాడొద్దన్నందుకు..

యల్లనూరు: యల్లనూరు మండలం పెద్దమల్లేపల్లికి చెందిన రామాంజినేయులు, సావిత్ర దంపతుల మూడో కుమార్తె అశ్విని (19)కి వేములపల్లి గ్రామానికి చెందిన మేనమామ కొడుకుతో వివాహం జరిపించాలని ఇరు కుటుంబాల సభ్యులు నిశ్చయించుకున్నారు. ఈ నేపథ్యంలో వివాహం నిశ్చయం కాకముందే అబ్బాయితో మాట్లాడడం బాగుండదని అమ్మాయికి సూచించారు. అయినా ఆమె తరచూ ఫోన్‌లో అబ్బాయితో మాట్లాడుతుండడం గమనించిన తల్లిదండ్రులు మంగళవారం రాత్రి మందలించారు. దీంతో మనస్తాపం చెందిన అశ్విని బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

వివాహిత హత్య



హతురాలు యల్లక్క

కళ్యాణదుర్గం రూరల్: ఇల్లాలిపై అనుమానం పెనుభూతమైంది. నాలుగు పదుల వయసులో ఉన్న భార్యకు ఇతరులతో వివాహేతర సంబంధం అంటగడుతూ భర్త దాడి చేయడంతో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామ ఎస్సీ కాలనీలో నివాసముంటున్న నాగరాజు, యల్లక్క (42) దంపతులకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా యల్లక్క ప్రవర్తనపై భర్తకు అనుమానాలు ఎక్కువయ్యాయి. ఇతరులతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నావంటూ తరచూ ఆమెతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే బుధవారం తెల్లవారుజామున భార్యతో మరోసారి గొడవపడ్డాడు. అనవసరంగా తనపై నిందలు వేయడం మంచిది కాదని ఆమె సమాధానమివ్వడంతో పక్కనే ఉన్న ఇనుప చువ్వతో ఆమె పొట్టపై బాదాడు. బలమైన దెబ్బ తగలడంతో యల్లక్క ఒక్కసారిగా కుప్పకూలింది. అనంతరం గుట్టుచప్పుడు కాకుండా నాగరాజు అక్కడి నుంచి ఉడాయించాడు. ఉదయం కుటుంబసభ్యులు నిద్రలేచి యల్లక్కను గమనించి లేపేందుకు ప్రయత్నించారు. ఆమెలో చలనం లేకపోవడంతో మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని సీఐ తేజమూర్తి, ఎస్ఐ నాగమధు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే 'నారాయణ' విద్యార్థి అదృశ్యం

- విద్యార్థి సంఘాల నాయకుల ఆరోపణ



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రాప్తాడురూరల్: నగరంలోని నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఆ కళాశాల విద్యార్థి కనిపించకుండా పోయాడని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆ కళాశాలలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.... కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి చంద్రను యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ వచ్చిందన్నారు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థి మంగళవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాడన్నారు. ఘటనపై ఆరా తీసేందుకు వచ్చిన విద్యార్థి తల్లిదండ్రులకు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. ఫీజులు కట్టించుకోవడంలో ఉన్న శ్రద్ధ విద్యార్థులకు భద్రత కల్పించడంలో నారాయణ కళాశాల యాజమాన్యానికి లేదని మండిపడ్డారు. ఘటనకు కారకులైన యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న అనంతపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన కారులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయి స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశి, హరి, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు, శివ, వినోద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గార్లదిన్నె: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... అందిన ముందస్తు సమాచారం మేరకు బుధవారం ఉదయం గార్లదిన్నె మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పామిడి వైపు నుంచి అనంతపురానికి బొలెరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించారు. 35 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పరిటాల హయాంలో అభివృద్ధి శూన్యం

- 25 ఏళ్లలో ఏ ఒక్కరికీ మంచి జరగలేదు
- ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఇంటింటికీ తిరగాలి
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: ''25 ఏళ్ల పరిటాల కుటుంబ పరిపాలనలో నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ మంచి జరగలేదు. ప్రాజెక్టుల పేరుతో దోచుకున్నారు. వందల ఎకరాలు పోగు చేసుకున్నారు. ఎంతసేపూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆస్తులు పెంచుకోవాలనే ఆలోచన తప్ప ప్రజల గురించి పట్టించుకోలేదు. పరిటాల కుటుంబం ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు చేసిందేమీ లేదు'' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయ జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ నేడు అభివృద్ధి దిశగా కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చి మాటపై నిలబడిన నాయకుడిగా జగనన్న నిలిచారన్నారు. నేడు భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వ్యవసాయ ఉత్పాదకత గణనీయంగా పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు గతం కంటే మెరుగయ్యాయని పేర్కొన్నారు. జగన్ హయాంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ దేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న 5వ రాష్ట్రంగా ఎదిగిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి ర్యాంకు సాధించిందన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వంలో రుణభారం 169 శాతం పెరిగితే, 2019 తర్వాత కోవిడ్ మహమ్మారి ప్రభావంలోనూ జగన్ ప్రభుత్వం దానిని 58 శాతానికి తగ్గించిందన్నారు.

21 నుంచి 31 వరకూ ప్రతి గడపకూ వెళ్లాలి

ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులతో కలిసి ప్రతి గడపకూ వెళ్లాలన్నారు. మనం చేసిన అభివృద్ధిని వివరించి ప్రత్యర్థుల దుస్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. నియోజకవర్గంలోనూ నిత్యం హత్యలు, దౌర్జన్యాలు, దోపిడీలు, అరాచకాలను గమనిస్తూ వచ్చారన్నారు. 2014లో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేస్తే 2016 నుంచి వారి ప్రభుత్వాన్ని గద్దె దించాలని అన్ని వర్గాల ప్రజలు నిర్ణయించుకున్నారు. ఈ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న మనం ఏ చిన్న పోరాటం చేసినా పెద్ద ఎత్తున ప్రజల మద్దతు లభించిందన్నారు. వారి అరాచక పాలనకు 2019లో చరమగీతం పాడారన్నారు. చంద్రబాబు హయాంలో బడా కాంట్రాక్టర్లు, పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలు బాగుపడితే.. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదల అభివృద్ధి చెందారు. ప్రతి కుటుంబం బాగుపడిందన్నారు. సమావేశంలో రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ కన్వీనర్లు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వార్డు మెంబర్ మృతి



వేణుగోపాల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చందు

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన ఆరవ వార్డు మెంబర్ వేణుగోపాల్ (48) బుధవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మరణించారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు.. వేణుగోపాల్ బుధవారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి వచ్చి ఇంట్లో పడుకున్నారు. ఉదయం వేణుగోపాల్ నిద్ర లేవకపోవడంతో అనుమానం వచ్చిన భార్య నిద్రలేపింది. అప్పటికే ఆయన మరణించాడు. గుండె పోటుతో నిద్రలోనే మరణించి ఉండవచ్చని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

పరామర్శ..

విషయం తెలుసుకున్న తోపుదుర్తి చందు బుధవారం ఆత్మకూరుకు వచ్చి వేణుగోపాల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధైర్యపడకండి అండగా ఉంటామని భార్య, కూతురికి ధైర్యం చెప్పారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కూడా వేణుగోపాల్ మృతదేహానికి నివాళులర్పించారు.

రేపు వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని రామ్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. స్వామికి పుష్పయాగం, అభిషేకంతో పాటూ కల్యాణం జరిపిస్తామని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించాలని కోరారు.

సాయిట్రస్టుకు ఎక్సలెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ట్రస్టు నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: గ్రామ స్వరాజ్య ఫౌండేషన్ వారు జాతీయ స్థాయిలో అందించే ఇండిపెండెన్స్ ఎక్సలెన్సీ అవార్డును బుధవారం హైదరాబాద్‌లో సాయిట్రస్టు నిర్వాహకులు అందుకున్నారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ రాములు, టీఆర్ఎస్ నాయకుడు దేవానంద్, బుల్లితెర నటులు రామారావు, మిస్ ఇండియా సుధాజైన్ తదితరుల చేతుల మీదుగా ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ అందుకున్నారు. నిత్యన్నదానం, అనాథలకు అంత్యక్రియలు, గుండె ఆపరేషన్లు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సాయిట్రస్టు ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

29న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఈనెల 29న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అనంతపురంలోని తన స్వగృహంలో విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను అందరి వాడు సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విగ్రహావిష్కరణకు రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ గోరంట్ల మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

పీర్లమకానంలో అన్నదానం



భోజనం వడ్డిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: కోవూరు నగర్‌లోని లాలూ సాబ్ పీర్ల మకానంలో బుధవారం రాత్రి పెద్ద ఎత్తున అన్నదానం జరిగింది. పీర్ల పండుగ ముగియడంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మేయర్ మహ్మద్ వసీం ఆత్మీయ అతిథిగా పాల్గొని భోజనం వడ్డించారు. కులమతాలకతీతంగా మొహరం వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు మకానం వద్ద నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, కమిటీ సభ్యులు సురేష్, పవన్, పార్వతి, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో డాక్టర్ ప్రియాంక సత్తా

- తల్లిపాల ప్రాముఖ్యతపై నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానం దక్కించుకున్న వైద్యురాలు



డాక్టర్ ప్రియాంకకు ప్రశంసాపత్రం అందజేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాలలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యురాలు డాక్టర్ పోసిన ప్రియాంక (ఎండీ) జాతీయస్థాయిలో మెరిసింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ సూచనల మేరకు ఢిల్లీ మౌలానా అజాద్ వైద్య కళాశాల ఇటీవల తల్లిపాల ప్రాముఖ్యతపై నిర్వహించిన పోటీల్లో డాక్టర్ ప్రియాంక ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఆ కళాశాల పంపిన ప్రశంసాపత్రాన్ని బుధవారం డాక్టర్ ప్రియాంకకు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో రీల్ మేకింగ్‌పై ప్రపంచ స్థాయిలో బ్రెస్ట్ ఫీడింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడం కళాశాలకే గర్వకారణమన్నారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ ప్రియాంకను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భవిష్యత్తులోనూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రాయచోటికి చెందిన డాక్టర్ ప్రియాంక తండ్రి వీఏ నారాయణ అంతర్జాతీయ స్థాయి ఉత్తమ జర్నలిస్టు అవార్డు గ్రహీత, తల్లి పుష్పావతి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత కావడం గమనార్హం. వీరి కుటుంబంలో మొత్తం నలుగురు ఎండీ వైద్యులు కావడం విశేషం. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ డాక్టర్ మధుసూదన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాల్మీకి శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నిహారిక, డాక్టర్ సుమన్, డాక్టర్ సుష్మ, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ నాగప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస

అనంతపురం పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో పలువురు ఉద్యోగులు ఉత్తమ సేవలకు గాను ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా వారు అవార్డులు స్వీకరించారు.

– అనంతపురం అర్బన్:



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ శ్యామ్యూల్ బెంజిమెన్



నగేష్, లైన్‌మెన్



అయూబ్ ఖాన్, సూపరింటెండెంట్, సర్వే శాఖ



నరేష్, కంప్యూటర్ అసిస్టెంట్, కలెక్టర్ క్యాంపు కార్యాలయం



కమల్ బాషా, హెడ్ కానిస్టేబుల్



బద్దే నాయక్, స్కూల్ అసిస్టెంట్

కుక్కల బెడదకు పరిష్కారం చూపాలి



కమిషనర్ భాగ్యలక్ష్మితో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం క్రైం: నగరంలో కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. బుధవారం నగర పాలక సంస్థలో కమిషనర్ భాగ్యలక్ష్మిని కలసి, విన్నవించారు. వివిధ డివిజన్ల పరిధిలో కుక్కలు, పందుల సమస్య ఉందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. దోమకాటు నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఇప్పటికే ఫాగింగ్ చేయిస్తున్నట్లు వివరించారు. కొన్ని డివిజన్లలో మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారని, పూర్తి స్థాయిలో చేపట్టడం లేదని కార్పొరేటర్లు అబూసలేహ, దుర్గాదేవి, లీలావతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, నాయకులు రవి, తదితరులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అన్ని డివిజన్లలో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలని కమిషనర్ భాగ్యలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



చెన్నేకొత్తపల్లి: అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న అధికారులు



కనగానపల్లి: ఉత్తమ సేవా అవార్డు పొందిన రాంనాగేష్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కనగానపల్లి: ఎంఈఓ కార్యాలయంలో మెసెంజర్‌గా పని చేస్తూ ఉత్తమ సేవా అవార్డు పొందిన రాంనాగేష్‌ను బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సన్మానించారు. ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవిలతో పాటు కార్యాలయ సిబ్బంది అతనికి పూలమాలలు, శాలువాలు వేసి అభినందించారు. అలాగే ఉత్తమ సంక్షేమ అధికారిగా అవార్డు పొందిన హాస్టల్ వార్డెన్ వెంకటేష్‌కు పలువురు మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రామన్న, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో మేడాపురం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ సీఆర్పీ వెంకటేష్, కనుముక్కల జెడ్పీహెచ్ఎస్ పీటీఐ పవన్ కుమార్, చెన్నేకొత్తపల్లి ఎంఆర్‌సీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న శివారెడ్డి ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. బుధవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ–1 మున్వర్‌బాషా, ఎంఈఓ–2 ప్రసన్న కుమార్ నాయుడు తదితరులు అవార్డులు స్వీకరించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది రామసుబ్బారెడ్డి, సీఆర్పీ శివయ్య నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

19న టెంకాయల విక్రయ హక్కుకు వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి సన్నిధిలో ఈనెల 19న టెంకాయల విక్రయం హక్కు కోసం బహిరంగవేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. మాఘమాసం మినహా విడిదినాల్లో మాత్రమే టెంకాయల విక్రయం హక్కు కోసం వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.50 వేలు చెల్లించి వేలంలో పాల్గనాలని సూచించారు.

కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్



గార్లదిన్నెలో తాపీ మేస్త్రీలకు ఉచిత ప్రమాద బీమా బాండ్లు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్ అని కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాయుపుత్ర ఏజెన్సీ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌పై వివరించారు. స్లాబ్‌కు భారతి సిమెంట్ అనుకూలమైందన్నారు. పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందన్నారు.అనంతరం తాపీ మేస్త్రీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్‌లు అందజేశారు. డీలర్ అనిమి రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

భూ తగాదా కేసులో ఏడుగురికి రిమాండ్

గార్లదిన్నె: కొప్పలకొండలో భూ తగాదాకు సంబంధించి బుధవారం ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. గ్రామంలో ఈ ఏడాది మార్చిలో నారాయణ, భాస్కర్ వర్గాలు భూ తాగాదా విషయమై ఘర్షణ పడ్డారన్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి అనంతపురం కోర్టులో హాజరు పరిచామని, జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాడిపత్రి: గంగాదేవిపల్లి గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి బుధవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశామన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని శ్రీసత్యసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.గోపిచంద్ (17) అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శింగనమల మండలం సలకంచెరువు గ్రామానికి చెందిన గోపిచంద్ శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈనెల 15న రాత్రి 8:30 గంటల సమయంలో ఊరికి వెళ్తానని చెప్పి వెళ్లాడు. మరుసరి రోజు ఉదయం కళాశాల నుంచి విద్యార్థి తండ్రికి ఫోన్ చేయగా ఇంటికి రాలేదని చెప్పాడు. బుధవారం విద్యార్థి తండ్రి ఎం.రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోగులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సిటీ స్కాన్ యంత్రం మరమ్మతులకు గురికావడంతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. సిటీ స్కాన్‌ను ఎల్ఎల్ డయాగ్నస్టిక్స్ నిర్వహిస్తోందన్నారు. ఎంఓయూ ప్రకారం సిటీ స్కాన్ పని చేయని రోజుల్లో సంబంధిత నిర్వాహకులే రోగులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలన్నారు. నాన్ ఎమర్జెన్సీ కేసులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో, ఎమర్జెన్సీ కేసులను ఓవీఆర్ డయాగ్నస్టిక్స్‌లో స్కాన్‌లు తీసేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఎమర్జెన్సీ కేసులకు ఎస్ఎల్ డయాగ్నస్టిక్ నిర్వాహకులే రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

కనగానపల్లి: వ్యవసాయ బోర్లకు సరఫరా అవుతున్న విద్యుత్ లోఓల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని దాదులూరు గ్రామ రైతులు కోరారు. లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని బుధవారం మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. గత 15 రోజులుగా వ్యవసాయ బోరుబావులకు సరఫరా అవుతున్న విద్యుత్ హెచ్చుతగ్గులుగా వస్తోందన్నారు. దీంతో వ్యవసాయ మోటార్లు కాలిపోయి నష్టపోతున్నామని రైతులు ప్రభాకర్, కేశవ, నరసింహులు, చంద్రమౌళి, లక్ష్మీపతి తెలిపారు. అధికారులు స్పందించి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ముస్లింలు ప్రభుత్వానికి అండగా నిలవాలి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మేయర్ వసీం, నదీం తదితరులు

అనంతపురం కల్చరల్: మైనార్టీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని మేయర్ మహమ్మద్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమద్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్ కె సాత్ కార్యక్రమంలో భాగంగా సిండికేట్ నగర్‌లోని సీపీఐ కాలనీ మదీనా మసీదులో బుధవారం ముస్లిం పెద్దలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేకూరుతున్న లబ్ధిని వివరించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. హజ్ యాత్రికులకు భారం పడకుండా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తించారని తెలిపారు. ముస్లింలకు ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్షావలి, ఇమామ్ పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అనంతపురం: భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించాలని జేఎన్‌టీయూ అనంతపురం ఎంబీఏ విభాధిపతి డాక్టర్ టి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ డి.వరలక్ష్మి ఆధ్వర్యంలో నా భూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నా భూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగం అడ్‌హాక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బీసీ లక్ష్మన్న, డాక్టర్ జయరామిరెడ్డి, డాక్టర్ బసవయ్య పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ బదిలీ


అనంతపురం సెంట్రల్: ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ అపర్ణను సత్యసాయి జిల్లాకు బదిలీ చేసినట్లు తెలిసింది. మిషన్ వాత్సల్య పథకంలో జరిగిన అక్రమాలపై ఇటీవల ఆర్జేడీకి ఫిర్యాదులు అందడంతో ఆమెను బదిలీ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

కోనసీమను తలపించేలా..



ఆర్.కొత్తపల్లిలో వరి సాగు చేసిన రైతులు

కోనసీమను తలపించేలా.. రామగిరిలో రైతన్నలు పంటల సాగుపై దృష్టి సారించారు. కొన్నేళ్లుగా వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలను సాగు చేసుకోలేక, కుటుంబ పోషణ భారమై ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. అయితే జగన్ ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని చెరువులకు కృష్ణా జలాలు వచ్చేలా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. దీంతో మండల వ్యాప్తంగా ప్రస్తుతం 200 ఎకరాలకు పైగా వరి సాగు చేశారు – రామగిరి:



గత యేడు కృష్ణా జలాలతో నిండిన పేరూరు డ్యాం